ఉత్తరాల ఉపద్రవం

శ్రీ కాకర్లమూడి సీతారామస్వామి

వాకిట్లో వాలుకుర్చీలో పడుక్కొని చించిన కవరులోని చీటీ తీసి ఆతురతగా చదువుకో సాగింది. ఉత్తరం చివర కొచ్చే కొద్దీ ఆమె ఉత్సాహం ఉరకలు వేసింది. హృదయం ఉప్పొంగింది. 'నీప్రియ ప్రకాశం' అన్న ముక్కలు మాత్రం అనుకోకుండా పైకి చదివేసినది. ఒళ్ళో పడి ఉన్న కార్డూ, కవరూ ఆలానే ఉన్నై. చేతిలో ఉన్న ఉత్తరాన్నే రెండు, మూడు సార్లు చదువుకొన్నది. ఉత్తరాన్ని గుండెలకద్దుకొంటూ, కళ్ళు మూసుకొని వెనక్కి పడుక్కొని హృదయంలో యిష్ట దైవానికి నమస్కారాలు చేసింది. ఏదో ఆనందంలో ఆమె ఆలానే ఉండిపోయింది.

"ఏమేవ్ ! మఱదలు బుల్లీ ! వంటయిపోయిందా ఏమిటి? ఎక్కడా చడీ చప్పుడూలేదు." అంది బిందె చంకనెట్టికొని దొడ్డి గుమ్మంలోకి వచ్చిన సరోజిని. ఆ మాటలకు ఉలిక్కి పడిలేచి ఉత్తరం కుర్చీలో పడేసి జోరుగా వంటింటి తలుపు తీసికొని దొడ్డిగుమ్మంలోకి వచ్చింది. ఆనడకతో ఒళ్ళోని ఉత్తరాలు దారిలో జారిన సంగతి కూడా ఆమెకు తెలీదు.

"అదికాదు వదినా! పోష్టుమాన్ వస్తేనూ" అని యింకా చెప్పబోతుండగానే—

"మా తమ్ముడు వస్తున్నానని ఉత్తరం వ్రాసాడా ఏమిటి?" అని బుగ్గ మీద కొడుతూ ప్రశ్నించింది—

ప్రమీలాదేవి సిగ్గుతో 'ఔ'నని తల వూపింది. "అదే మిటే, కాపరాని కొచ్చి రెండేళ్ళాయె. అంతక్రితం కాలేజీలో రెండేళ్ళూ హాయిగా ఉంటిరాయె. ఇంకాసిగ్గేనా? సరే కాని యింకాఏమన్నా విశేషాలు? అంతా కులాసా?" అని ప్రశ్నించింది సరోజిని, బిందె ఎడం చేతిలోకి మారుస్తూ.

"లోపలికి రా వొదినా ! ఎండలోనే నిలబడ్డావ్. నీకే యిస్తాను. ఉత్తరం చదువుదువు గాని" అనిబిందె అందుకొని క్రింద బెట్టి, చేయిపట్టుకొని లోపలికి తీసికెడుతూండగా.

"ఇవెక్కడినుంచే, ఈ కవరింకా చించనే లేదు. ఈ కార్డెవరు వ్రాసారు" అని క్రింద పడ్డ రెండు ఉత్తరాలు తీసి ప్రమీల చేతికందిచ్చింది. ఆ విషయం ప్రమీలకేమీ ఆశ్చర్యం కలిగించ లేదు. ఆ ఆనందోత్సవంలో ఆమె చేతిలోంచి అందుకొని, కుర్చీలోని చీటీ అందిస్తూ!

"కూర్చొని చదువు"

అని కుర్చీ వెనుకకు వచ్చి, ఆమె బుజాల మీద చేతులానించి నిలబడ్డది. సరోజిని ఉత్తరం చదవబోతూ ఆగి! "అయితే ప్రమిలా! మొగుడు వ్రాసిన ఉత్తరాలు అందరి చేతికీ యిస్తారుటే" అని నవ్వుతూ వెనక్కిచూసింది.

"నువ్వు మరీనే. కాలేజీలో చదివేటప్పటికీ ఇప్పటికీ చాలా మారిపోయావు. చదువు, చదువు".

సరోజిని లో లోపల ఉత్తరమంతా చదువు కొన్నది. ఉత్తరములోని సంతోషజనక మయిన సంగతులకు తన ఆనందాన్ని వెలిబుచ్చి, బుగ్గ మీద వ్రేలితో కొడుతూ: "యింక మరదలు పిల్ల క్రింద నడవక్కర్లేదు" అంటూ వెళ్ళిపోయింది నవ్వుతూ.

ప్రమీలాదేవికి ఎక్కడ లేని సిగ్గూ ఆవరించింది. అద్దంలో ప్రతిఫలిస్తూన్న ఆమె నీలి కన్నులు పరిహసించి నట్లనిపించినవి. తన భర్త తనకు వ్రాసిన ఉత్తరం అందరికీ చూపటం అంత మంచిది కాదను కొన్నది. అయినా సరోజిని తనకు పరాయిదా ఏమిటి? అయిదేళ్ళు కలసి చదివినది. తన భర్త సరోజినిని ఎరగనివాడా? అందు చేత అదేమీ హాస్యాస్పదం కాదనుకొన్నది. అదీ కాక తనభర్త భవిష్యత్తును మనస్ఫూర్తిగా ఆశీర్వదించేవారిలో సరోజిని కూడా మొదటి తరగతిలోకే వస్తుంది. ఇలా ఏవేవో ఊహించుకుంటూ తిరిగి ఉత్తరం తీసి చదువుకో సాగినది.

"డియర్,

ఆశీర్వాదాలు—నాకు తెలుసు, నిన్ను ఒక్కత్తినీ విడచి యిన్నాళ్ళు తిరగటం నిన్ను చాలా బాధిస్తుందని. అయినా నేను తిరిగి వచ్చేలోగానే ఈ శుభవార్త నీకంద జేస్తున్నాను. ఈసారి ప్రయాణం వృధావ్యయం కాలేదు.

ఉత్తరాల ఉపద్రవం

'నవభారతి' దిన పత్రికకు వారం వారం వ్రాసినందుకు నెలకు 60 రూపాయిలిస్తానన్నారు. 'ఉషోదయం' మాస పత్రికకు సీరియల్ నవల యిచ్చేటట్లయితే సంచికకు 20 రూపాయిలిస్తానన్నారు. 'విదుషి' 'గృహలక్ష్మి' అనేస్త్రీల మాస పత్రికలకు నువ్వు వ్రాస్తే దాని ద్వారా నెలకు పదిహేను రూపాయిలిస్తానన్నారు. ఇంతలో కొంత బైట పడ్డామనే భావించు. ఇక్కణ్ణుంచి మనం స్వర్గధామంలో బంగారు తూగుటూయెలలమీద ఊగలేకపోయినా ఎవరి దగ్గరా చెయ్యి జాచనక్కలేదు.

నాజీవితంలో సమభాగస్థురాలవుగా, నావర్తమాన భవిష్యత్తులో సహచరివిగా ఉన్న నువ్వుకూడా నాతో సమానంగా ఆనందిస్తావనుకుంటా. భవిష్యత్తు యింకా బావుంటుందనే ఆశావాదం మనకు దోహద మిస్తుంది. నీయిష్టదైవం 'వాణి'కి నానమస్కారాలు........"

ఏదో బ్రహ్మాండమయిన భారం ఆమె హృదయంలోంచి జారి పోయినట్లయింది. ఒక్కసారి చేతులు జోడించి ఎదురుగావున్న సరస్వతి విగ్రహానికి నమస్కరించింది. తమదాంపత్య సౌఖ్యం ప్రసాదించవలసినదిగా మనస్సులో ప్రార్థించింది. అలానే కాస్సేపుకూర్చున్నది. అప్పటికి జ్ఞాపకం వచ్చింది, మిగిలిన ఉత్తరాలమాట.

తన అజ్ఞానానికి తనే నవ్వుకుంటూ కార్డు తీసి చదివింది. ఎవరో అపరిచితులు వ్రాసినట్లేఉంది. ఏమిటో ఆయన వ్యాసాలు గూర్చి ప్రశంసించాడు. రెండోకవరు చించింది. మెల్లిగా కాగితం తీసి చదువుకోసాగింది.

"దేవీ, ముద్దులు—

ఈఉత్తరము వ్రాయకూడదనుకుంటూ వ్రాస్తున్నా. నీకూ, నాకూ మధ్య ఎన్నిమైళ్ళు దూరముందీ అని ఆలోచించుకొంటే చాలా బాధగా ఉంది. ఎక్కడో మామూల పల్లె పట్నం. కాని ఇంట్లో నువ్వు ఏకాకివిగా నాకోసం కళ్ళు కాయలు కాచేట్లు చూస్తూకూచుంటావ్.

కాని—

జనసమ్మర్ధమయిన పట్నంలో ఓచివర ఆసుపత్రిలోమంచంమీద నేను నీగురించే ఆలోచిస్తున్నాను. మరేం భయ పడకు. నువ్వుపుత్త అమాయకురాలవు ప్రమీలా! అదిగో. అప్పుడే కంటతడి పెట్టుతున్నావ్. జీవితంలో ఎప్పుడూ ఒకేలాగా ఉంటామా! అంత చదువు చదివినా, అన్ని కథలువ్రాసినా నువ్వు బేలగా అయిపోతే ఏలా!

ఏదీ ఒక్కసారి నువ్వు నవ్వితే ఈ సమయంలో నాకెంతో తృప్తి కలుగుతుంది. బాధంతా తీరిపోతుంది. నవ్వావు కదూ నా కోసం. పెద్దభయపడవలసిన ప్రమాదమేమీ లేదు. పాపం! కొత్తగా కారునడపటం నేర్చుకుంటూన్న ఒక అమ్మాయి పొరపాటున సైకిలుమీద వస్తూండగా డేష్ యిచ్చింది. చుట్టపెట్టుకుపడ్డాను. కొద్దిగా దెబ్బలు తగిలాయి. అయినా పెద్ద గాయాలేమీ పడకుండా కారు ఆపుచేయగలిగింది అమ్మాయి. గబగబా క్రిందకుదిగివచ్చి ఎంతో దీనంగా;

"మానాన్నగారు డాక్టరే. నేను మందు వేయిస్తాను రండి. పొరపాటు ఎవరికన్నా వస్తుంది. క్షమించండి. మీకు నయమయేవరకూ మాహాస్పిటల్‌లో వుండవొచ్చు." అని తీసికెళ్ళింది. ఆ అమ్మాయి ఎంతమంచిదనుకున్నావ్. వయస్సులో పెద్దదే అయినా చెల్లాయీ అని పిలుస్తాను. ఆమె అన్నయ్యా అంటూ వచ్చి మందిచ్చి వెళ్తుంది. డాక్టరుగారు సహజంగా హృదయంలేని వాడయినా నా విషయంలో మాత్రం శ్రద్ధవహిస్తున్నాడు. రెండు, మూడు రోజులలోనే నేను తేసుకోవచ్చు. మళ్ళీ త్వరలోనే జవాబువ్రాస్తా—

నీకు తోచకపోతే సరోజిని అక్కయ్యతో కాలక్షేపం చెయ్యి. ఆమెకు బాగా తెలుసు ప్రపంచం— ఏదీ మరొక్కసారి నవ్వు— వెయ్యి ముద్దులు— నీ........."

అని చదవటం ముగించింది. ఆమెకీ ప్రపంచమే అంధకారబంధురమయినట్లు కనిపించింది. ఏమిటీ పరస్పర విరుద్ధంగా ఉత్తరాలు. ఆశ—నిరాశ. ఇదేనా మిగిలేది. ఆయన ఆరోగ్యం ఎలాఉన్నదో? ఒక ఉత్తరానికీ ఇంకో ఉత్తరానికీ సామరస్యంలేదు. ఆమె కన్నులు తెరచేవున్నా ఏమీ కనపట్టంలేదు. సజీవమయినా అచేతనమయింది. ఉత్తరంచదువుకొంటూమాత్రం రెండుసార్లునవ్వింది. తన భర్త ఆజ్ఞాపాలనో? కాక ఆయన ఆనందంకోసమో— అలా అచేతనంగా రెండు మూడు నిమిషాలు పడుకొని ఉత్తరం చేత్తోపట్టుకొని లేచి దొడ్డిగుమ్మంలోకి వెళ్ళి నెమ్మదిగా సరోజినిని పిలిచింది. ఆయింటికీ ఈ యింటికీ బాహాటంగా వస్తూ పోతూ ఉండటానికి మార్గం ఉంచేసి అడ్డగోడ కట్టారు. ఆ మార్గంగుండా సరోజిని వచ్చింది. వస్తూనే ప్రమీలాదేవి ముఖంలోని విచారరేఖల్ని, కను

రెప్పల అంచులనున్న తడిని పసికట్టి, ఆతురతతో,

"ఏమే అలా ఉన్నావ్?"

అంది లాలనగా సమీపించి—ప్రమీల పెదిమ కదప కుండా ఉత్తరం చేతికిచ్చి గడపను జేరబడి నిలుచున్నది. సరోజిని ఆ వేగంతో ఉత్తరం సమగ్రంగా చదివి కృత్రిమ మందహాసంతో:

"అయ్యో, పిచ్చిదాన ఈపాటిదానికే యింత యిదవు తారుటే. కాక డాక్టరుగారింట్లోనే మకామాయె. రెండు మూడు రోజుల్లో రానేవస్తాడు. నడు, నడు. అన్నం తిన్నావా యింతకీ" అని నెమ్మదిగా వంటిట్లోకి తీసుకొచ్చి ఆరిపోయిన పొయ్యిలో మాడిన పోపు గరిటెచూచి.

"అదేమిటే ఈవిడ్డూరం. అబ్బెబ్బె, నువ్వు మరీ పసి పిల్లవవుతున్నావే! చాల్చాలు, ఎవరన్నాచూస్తే నవ్విపోతా రనన్నా ఉండాలి. ఉండు. ఇవాళ్టికి నేనుకాస్త కూరా, పచ్చడీ యిస్తాను—పోనీలే! అన్నం ఎలానూ ఉడికింది కనుక అగిన్నె అక్కడికే పట్టుకెళ్ళి కలిసి తిందాం. ఆయ నెలానూ యింట్లో లేరు, రా రా" అని మరోసారి ఉత్తరం వయిపు చూస్తూ ఆలోచించసాగింది.

"అదికాదే! ఏమిటీ ఉత్తరాల వరస. ఏవో పత్రికలు- కాంట్రాక్టులు– మళ్ళీ గాయాలు- జ్వరం. రెండూ ఒక్క రోజునే. అందులో ఈ గొడవలేమి, ఇందులో అవిషయం లేదు. పోనీ అంటే 'రైటింగ్' ఆయనదే అని ప్రత్యక్షరాల తెలుస్తోంది" అని ఆగింది.

ప్రమీలాదేవి కన్నులలోని తడి ఆరనేలేదు. ఆమె గొంతు గద్గదంగానే పలుకుతున్నది. ముఖంలో విషాద చ్ఛాయలు విస్తరిస్తూనే ఉన్నవి. సరోజిని రెండు క్షణాలు అలానే నిలబడి ఆలోచించి రెండో ఉత్తరం తీసికొచ్చి చూసింది. ఆమె ముఖంలో ఈసారి ఒక ఆశారేఖ వెల్లి విరిసింది. చిరునవ్వు చిందులాడింది.

"ఓస్, మరదలు పిల్లా! ఇదిగో ఇదివ్రాసివారమయింది. అంటే వెళ్ళిన మరునాడే హాస్పటల్‌లో చేరాడు. తరువాయి పనులన్నీఅయాక ఆవిషయాన్నే మరిచిపోయి ఆనందంలో యిది వ్రాసాడు. మా తమ్ముడికి మరుపెక్కువని నీకు తెలియదూ?"

అని బుగ్గమీద చిటికినవేలుతోకొట్టింది. రెండుఉత్తరాలు పుచ్చుకొని చూచింది. అప్పటికి సంతృప్తి కలిగింది. ఉత్త రాలు నెలలు తరబడి ఆలస్యంగా వస్తూండడం పత్రికలలో చదివినట్టు గుర్తుకు రాగానే సంతృప్తి వహించింది. అయినా ఆయన ఆరోగ్యం పూర్తిగా బాగయిందో? అని కూడా భయపడ్డది,

రెండో ఉత్తరంలో ఆయన ఆరోగ్యాన్ని గూర్చి వివ రించకపోయినా అనారోగ్య ప్రస్తావన లేకపోవడం శుభ సూచకమేనని తృప్తిపడ్డది.

★

మేలుకొల్పు

శ్రీ పి. రామజోగారావు

ఉదయించుచుండెనదుగో బాలభానుడు ఉదయాద్రినుండి
తరలి
కనుపించుచుండెనవిగో పొట్టిశ్రీరాముని ఆనందభాష్పసరళి
కదలుచుండెనదిగో ఆంధ్రరాష్ట్ర దిగ్విజయ రథావళి.
మేలుకొనవమ్మ ఇంకనీబిడ్డల మేలుకొల్పతెనుగుతల్లీ.

మరచిపోవుచున్నారు నీపూర్వమహితశక్తి
గుర్తుచేయవమ్మనీసవతి బిడ్డలపైనిఅనురక్తి
అవగాహనచేయవమ్మ నీబిడ్డలసహనశక్తి
చాటుకోవమ్మబిడ్డలకు నీయందలిమాతృభక్తి
ఉప్పొంగుచుండె నీబిడ్డలఉడుకురక్తమ్ము
అందుకొనవమ్మ ఆంధ్రమహిళల మంగళహారతులు
ఆశీర్వదించవమ్మ నీఅమృతహస్తములతోడ
తిరిగిఒకసారిదిద్దుకోవమ్మ బిడ్డలతెనుగుతల్లీ.

యుగంధరునివంటి ప్రకాశము నీముందరుండె
తిక్కనవంటి ఖేదలి నీప్రక్కనుండె
కాచుకొనిఉన్నారెందరెందరో నీయాజ్ఞలందుకొనగ
ఏలుకోవమ్మ నీఅఖిలాంధ్ర సామ్రాజ్యము.

ఆంధ్రమ్ములోపలుక్క అమృతంపు పలుకు.
ఆంధ్రకృపాణపు అంచులచురుకు
ఆంధ్రభూములలోని ఆదర్శంపుపైరు
తెలుపుకోగదమ్మ ప్రపంచమెల్ల తెలిసికొనగ.

కనుపించుచున్నదదిగో ఆంధ్రుల జయపతాకమ్ము
వినుపించుచున్నదదిగో ఆంధ్రుల వీరపతాకమ్ము
నడిపించుచున్నదటగో ఆంధ్రుల బుద్ధిబలము.
మేలుకోగదమ్మ బిడ్డల మన్ననలందుకొనగ తెనుగుతల్లీ

★